


వీధిలోంచి 'పోస్ట్' అన్న కేక వినిపించడంతో - వంటింట్లో దొండకాయలు వేయించుతున్న శ్రీమతి - రైఫిల్‌లోంచి బయటికొచ్చిన గుండులా కన్నుమూసి తెరిచేలోగా వీధిగుమ్మంలో కొచ్చి

పడింది.

అప్పటికే పోస్ట్‌మేన్ చేతిలోంచి ఉత్తరాలందుకుంటున్నాడు కృష్ణమూర్తి.

"నాకేం రాలేదా?" అంటూ అన్నయ్య చేతిలోని ఉత్తరాల కట్ట మీద కెగబడింది శ్రీమతి.

"అబ్బ! ఉండవే - ఏమిటా కంగారు? వస్తే నీ ఉత్తరాలు నీ కియ్యకుండా నేనేం తినేస్తానా?" చెల్లెల్ని కసురుకుంటూ యింట్లోకి నడిచాడు కృష్ణమూర్తి. తోకలా అతణ్ణి వెన్నంటి నడిచింది శ్రీమతి.

ఒకొక్కటే ఉత్తరాన్నే చూస్తూ "ఇదిగోనే నీకేదో కార్డొచ్చినట్టుంది" అంటూ శ్రీమతికో కార్డందించాడు కృష్ణమూర్తి.

అందుకొని, ఆత్రంగా చదివింది శ్రీమతి. చదువుతూంటే ఆమె మొహంలో ఊసరవెల్లి రంగులు మార్చినట్టుగా, రంగులు మారిపోయాయి.

చెంపలు నల్లబడిపోయాయి. మరుక్షణంలో కోపంతో ఎర్రబడిపోయాయి. ఇంకో క్షణంలో యింకెలా మారుతుందో అన్నట్టుగా వున్న చెల్లెలి మొహంలోకి ఆశ్చర్యంగా చూస్తూ "వాట్ ఈజిట్?" అనడిగాడు కృష్ణమూర్తి.

ఆతడి ప్రశ్నను వినిపించుకొనే స్థితిలో లేదు శ్రీమతి. ఆమె కళ్ళలో నీళ్ళువుబుక్కొస్తున్నాయి. మనిషి సన్నగా కంపిస్తోంది.

చెల్లెలి చేతిలోంచి కార్డు లాక్కొని చదివాడు కృష్ణమూర్తి.

"కుమారి శ్రీమతిగారికి,

గత నెల 'విజయ'లో ప్రచురింపబడిన మీ రచన 'నేరం' జనవరి నెల 'కల్పన' మాస పత్రికలో ప్రచురింపబడిన 'తప్పు'కు మక్కీకి మక్కీ కాపీ అని తెలియజేస్తూ మా కార్యాలయానికి అసంఖ్యాకమైన ఉత్తరాలు వచ్చాయి. మీ ఈ చర్యను గర్హిస్తూ, వెంటనే ఇందుకు మీ సంజాయిషీ ఇవ్వవలసిందిగా కోరుతున్నాము.

ఫర్ ఎడిటర్ - రామయ్య."

"అయితే ఇదన్నమాట అమ్మగారి అసలు రంగు" అన్నాడు కృష్ణమూర్తి వెటకారంగా.

"....నో." అరిచింది శ్రీమతి ఆవేశంగా.

"ఏమిటో-నీ మొహం నో! ఔన్లే... దొంగతనం చేసినట్టు ఏ దొంగ మాత్రం ఒప్పుకుంటాడు."

"స్టాపిట్." మళ్లీ అరిచింది శ్రీమతి.

"గట్టిగా అరిచి నా నోరైతే

మొఖ్యాంచగలవేమో గాని, ఏం సంజాయిషీ యిచ్చి ఆ ఎడిటర్‌గారి నోరు ముయ్యించగలవే-అమ్మడూ? సిగ్గులేక వెధవ పనులు చేసింది చాలక, పైగా పౌరుషమొకటి.... బోడి పౌరుషం!" కస్సుమన్నాడు కృష్ణమూర్తి.

చిప్పుబుడ్డి బరస్ట్ అయినట్టు బరస్ట్ అయింది శ్రీమతి. "నేనేం అతడి జుట్టు అందుకొంది.

అతికష్టంమీద చెల్లెలి పట్టు విడిపించుకొని, దూరంగా జరిగాడు కృష్ణమూర్తి. "ఇది మరీ బావుంది. మొగుడు తన్నినందుకు కాక తోడికోడలు నవ్వినందు కేడ్చిందట - వెనకటికెవతో. చేసిన వెధవ పనికి సిగ్గుపడి చావక-నామీద విరుచుకు పడతావేమే గంపా!"

# మినీ కథ

వెధవ పన్లు చెయ్యలేదు. నోర్ముసుకొని నువ్వవతలకి పో."

"ఎవరో రాసిన కథను కాపీ కొట్టి నీ పేరుతో పంపించుకోడం వెధవ పని కాదు....పాపం! చాలా చాలా మంచి పని."

నిగ్రహించుకోలేనంత పిచ్చి కోపమొచ్చేసింది శ్రీమతికి. "ఒరేయ్....నిన్నూ....నిన్నూ..". అంటూ కృష్ణమూర్తి మీదకి దూకి,

అన్నగారలా అంటుంటే— కోపం, ఉక్రోషం రెండూ కలిసి దుఃఖంగా మారిపోయాయి శ్రీమతిలో. బొటబొటా కన్నీరు గారుస్తూ, సన్నగా ఏడ్వటం మొదలెట్టింది.

ముద్దుల చెల్లెలి కన్నీరు ఓ క్షణం మనసును కదిలించినా కూడా అంతలోనే గట్టి పడిపోయాడు కృష్ణమూర్తి. "ఈ జ్ఞానం ఆ వెధవ పని చేసే ముందే వుండాల్సింది.

ఒసే అమ్మడూ! తెలివి నీ ఒక్క దాని సొత్తే కాదే....పిల్లి కళ్ళు మూసుకొని పాలు తాగుతుంటే లోకం చూడకుండా ఊరుకోదే."

ఉడుక్కునే వాళ్ళను ఉడికించటం ఎవరికైనా సరదాగానే వుంటుంది. పళ్ళికిలిస్తూ మరీ వుడికించాడు.

కోపంలోంచి ఉడుకుమోతుతనం పుడుతుందో, లేక ఉడుకుమోతుతనంలోంచి కోపం పుడుతుందో తెలియదుగానీ, మొత్తానికి ఆ రెండూ మాత్రం ఎప్పుడూ కలిసి మెలిసే వుంటాయి. ఒక్కంగలో కృష్ణమూర్తిని సమీపించి, అతడి వీపుమీద పిడిగుద్దులు గుద్ది సన్నటి ఏడ్పును రాగాలాపనగా మార్చేసింది శ్రీమతి.

సరిగ్గా అప్పుడే పక్కింటి పిన్నిగారితో కబుర్లు ముగించి, ఇంట్లో కడుగుపెట్టిన పార్వతమ్మ ఆ దృశ్యం చూసి, చెట్టంత మగపిల్లాడిపై ఆడపిల్ల చెయ్యి జేసుకోటం సహించలేక - కోపంతో మండిపడింది.

"ఒసే దెష్టా! ఏం పోగాలము చ్చిందే నీకు?" అంటూ కూతుర్ని గుడ్లురిమి చూసి, కొడుక్కేసి తిరిగి "ఏమిట్రా కిట్టూ! దాన్నే మన్నావ్?" అనడిగింది కోపంగా.

"దాన్నే అడుగు చెబుతుంది" అన్నాడు కృష్ణమూర్తి—ముసిముసి నవ్వుని పెదవుల్లో దాచేసుకొంటూ.

"నన్నెవరూ ఏం అడగక్కర్లా.... నే నెవరికీ ఏం చెప్పక్కర్లా!"

"ఎలా చెబుతావులే....చెప్పడానికి మొహం చెల్లొద్దూ?"

ఎడాపెడా చెంపలు రెండూ వాయగొట్టేయా లన్నంత కోపమొచ్చేసింది శ్రీమతికి. కాని— ప్రక్కనే అమ్మ వుండటంవల్ల అతికష్టం మీద కోపాన్ని నిగ్రహించుకొంటూ, మరి అక్కడో క్షణం కూడా నిలువలేక పరుగు పరుగున తన గదిలోకి దూరి భళ్ళున తలుపేసుకొంది

"ఏమిట్రా? ఏమొచ్చింది దానికీ, నీకూ?" కూతురు పరుగదీసిన కేసి అయోమయంగా చూస్తూ. కృష్ణమూర్తి నడిగింది పార్వతమ్మ.

"దానికీ ఏం రాలేదు; నాకూ ఏం రాలేదు. మొన్నామధ్య 'విజయ'లో నా కథ పడిందోచ్ అంటూ డబ్బా వాయించుకు తిరిగింది చూడు—అది కాపీ కథట! వాళ్ళు ఉత్తరం రాశారు." కావాలని గదిలోని చెల్లెలికి వినిపించేంత గట్టిగా చెప్పాడు కృష్ణమూర్తి.

గదిలోంచి శ్రీమతి తలుపును తన్నిందో, ఏమో గాని....ఠప్

మంటూ పెద్ద చప్పుడైంది.

"కోపిష్టిముండ! అక్కడేదో నాశనం జేసేస్తున్నట్టుంది. చదువు కొనే పిల్లకి దాని చదువేదో అది లక్షణంగా చదువుకోక ఎందుకొచ్చిన రాతలో-కొంపలు ముంచే రాతలు! ఒరేయ్ కిట్టూ! ఇప్పుడేమైనా ప్రమాదమౌతుందేమిట్రా? వాళ్ళు గాని దాన్నేమైనా చేస్తారా?"

తల్లి అమాయకత్వానికి నవ్వొచ్చింది కృష్ణమూర్తికి. భర్త, తాను, తన పిల్లలు, వంటిల్లు, ఇరుగిల్లు, పొరుగిల్లు-అదే ప్రపంచం ఆవిడకి. అంతకుమించి బొత్తిగా ప్రపంచమే తెలియని మనిషి!

పెదవుల మీదికి రాబోయిన నవ్వును మనసులో దాచేసుకొంటూ అన్నాడు కృష్ణమూర్తి- "ఏమీ చెయ్యరనుకో....కాని, సిగ్గుచేటు కదూ? ఇంకొకరి కథను కాపీ కొట్టడమంటే ఏమిటనుకున్నావ్? దొంగతనం చెయ్యటంతో సమానము." ఇది కూడా గట్టిగానే అన్నాడు కృష్ణమూర్తి—'దొంగతనం' అన్న పదాన్ని మరింత గట్టిగా ఒత్తి పలుకుతూ.

"అలాగట్రా? అంత చదువు చదివి ఇలాంటి పన్జెయ్యడానికి ఎలా సిగ్గులేకుండాపోయిందిరా దానికి.... మన ఇంటా వంటా లేని పాడు బుద్ధులు ఎలా అబ్బాయిరా దానికి?"

తలుపుకి చేరగిలబడి, కోపాన్ని దిగమింగుకొంటూ, అమ్మా అన్నల సంభాషణను ఆలకిస్తున్న శ్రీమతిని తల్లి మాటలు బల్లెపు పోటులా తాకాయి. బోర్లగా మంచాని కడ్డం పడి వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

"పోనీలేరా, దాన్నింకే మీ అనకు. ఏడుస్తున్నట్టుంది పాపం!" అంటూ పక్కింటి పిన్నిగారినుండి కబురు రావడంతో వెళ్ళిపోయింది పార్వతమ్మ.

నిజానికి కృష్ణమూర్తికి కూడా చెల్లెలిమీద చాలా జాలేసి పోతున్నది. వెళ్ళి ఓదార్చాలనికూడా అనిపించింది.

కాని....ఇప్పుడా ప్రయత్నం చేస్తే— ఓదార్చటం మాట దేవుడెరుగు, తన్ను పీకి పాకం పట్టెయ్యదూ?

అదీ గాక....అప్పుడే ముగించేస్తే ఎలా? ఇంకా సుభాషిణక్కయ్య రావాలి — నాన్నగారు రావాలి.

జాలిపడటాన్ని వాయిదా వేసి, ఏదో పుస్తకం చేతబట్టుకూర్చున్నాడు-అక్క, నాన్నల రాక కోసం ఎదురుచూస్తూ.

ఓ అర్ధగంట గడిచేక — ఓ నిముషం అటూ ఇటుగా సుభాషిణి

రాధాకృష్ణయ్య లిద్దరూ వారి వారి ఆఫీసులనుంచి ఇంటికొచ్చారు.

కాళ్ళూ గట్రా కడుక్కొని, సుభాషిణి అందించిన కాఫీ పేవిస్తూ, ముందుగా రాధాకృష్ణయ్యగారే అడిగారు- "మీ అమ్మా, చిన్నమ్మలూ ఏరిరా కిట్టూ? కనపడరేం?"

ఆ ఇంట్లో సుభాషిణికి పెద్దమ్మలు, శ్రీపతికి చిన్నమ్మలూ ముద్దుపేర్లు.

"అమ్మ పక్కింటి పిన్నిగారి దగ్గర కెళ్ళినట్లుంది. చిన్నమ్మలు... అదిగో దాని గదిలో తలుపులేసుకు పడుకుంది." చెప్పాడు కృష్ణమూర్తి.

"ఏం? దాని ఒంట్లో బాగోలేదా?"

"ఔను. ఈ కార్డొచ్చినప్పట్నుంచీ బాగోలేదు" అంటూ జేబులోంచి కార్డు తీసి చల్లగా తండ్రి కందించాడు కృష్ణమూర్తి.

చదివి, మొహం జేవురించుకున్నాడాయన. "సిగ్గులేకపోతే సరి. బుద్ధిలేని పనులు చెయ్యమాసికి" అంటూ చేతిలోని కార్డుని విసిరి నేలకేసి కొట్టాడు. పాప మాయన "మా చిన్నమ్మాయి రాసిన కథ 'విజయ'లో పడిందండీ" అంటూ ఆఫీసులో అందరికీ ఘనంగా చాటుకున్నాడా వార్తని. ఇప్పుడీ సంగతి తెలిస్తే ఎంత అవమానం మరి?!

అప్పుడే తాను కూడా కాఫీ కలుపుకుని అక్కడికొచ్చింది సుభాషిణి. కొద్ది క్షణాల క్రితం మామూలుగానున్న తండ్రిఇప్పుడు కోపంగా వుండటం చూసి — కళ్ళతో ఏమిటని ప్రశ్నించింది కృష్ణమూర్తిని.

సుభాషిణి కళ్ళ ప్రశ్నను రాధాకృష్ణయ్యగారు కూడా గమనించి కోపంగా అన్నాడు- "ఆ కార్డు తీసుకొని చదువ్. నీ చెల్లెలు చేసిన ఘనకార్యం ఏమిటో తెలుస్తుంది."

కొంపదీసి ఇదిగాని ఏదైనా లౌ అఫైర్‌లో దిగి నెత్తిమీదకు తేలేదు గదా...—అనుకొంటూ — భయం భయంగా వొంగి, కార్డు తీసుకొని చదివింది సుభాషిణి. "ఛీ-ఛీ!.... ఎలాంటిపని చేసింది!" మనసులోని కోపం....అసహ్యం .... ఆ రూపములో ఆమె పెదవులు దాటి పైకొచ్చేశాయి.

"ఎక్కడుందిరా అది? ఇలా పిలువ్...."

"పిలిస్తే పలికేట్టులేదు. గదిలో దూరి తలుపులు బిడాయించుకుంది. నువ్వెళ్ళి ట్రై చెయ్" అన్నాడు కృష్ణమూర్తి.

విసవిసా కదలింది సుభాషిణి!

బాదీ, బాదీ—ఆమె చేతులు,

అరిచి, అరిచీ—ఆమె నోరు నొప్పెట్టేక....ఓ పావుగంట తర్వాత తెరుచుకున్నాయి శ్రీమతి గది తలుపులు.

విసురుగా గదిలోకి దూసుకెళ్ళి, చెల్లెల్ని నులిపి పారేసింది సుభాషిణి- "చేతనైతే సొంతంగా రాయాలి....లేకపోతే చేతులు కట్టుక్కూర్చోవాలి. అంతేగాని .... ఎందుకొచ్చిన పాడు పనులివి? నీ బోడికథ వెనుక ఇంత కథుందని తెలియక మా ఫ్రెండ్సందరికీ గొప్పగా చెప్పుకున్నాను. ఛీఛీ! ఇప్పుడెంత అవమానం!!"

"అక్కా!" బావురుమంది శ్రీమతి.

"మూయ్యవే నోరు .... చేసిన పనికిమాలిన పని చాలక—పైగా ఏడుపొకటి!" కసురుకొంది సుభాషిణి.

"అక్కా.... నిజంగా .... నేనా కథ నా సొంతంగానే రాశానక్కా! ....ఇలా ఎందుకు జరిగిందో .... నాకేం తెలియదక్కా! ...." వెక్కుతూ వెక్కుతూ చెప్పింది శ్రీమతి.

"ఔను పాపం! నువ్వు నేరని నంగనాచి....వెర్రి కొంగవి. వాళ్ళకేమీ పని లేక రాశారీ కార్డు." చేతిలోని కార్డుని చెల్లెలి మొహాన కేసి కొట్టింది సుభాషిణి.

"ఒట్టక్కా! నన్ను నమ్మక్కా! నేను కాపీ కొటలేదక్కా!...." ఇంకా ఏదో అనబోతోంది శ్రీమతి. అంతలో అక్కడికి వచ్చాడు కృష్ణమూర్తి —"నీ వాళ్లు తీపి బుట్టలో పెట్టవే అమ్మడూ! కాపీ కథ రాసి దొరికిపోయిన వాళ్ళంతా పాడే పాటే ఇది" అంటూ.

"అక్కా! చూడక్కా!" అంది శ్రీమతి—బిహాలు దీనంగా.

జాలి పడలేదు సుభాషిణి పైగా ...."చూస్తున్నానులే... అక్కా!" అంది వ్యంగ్యంగా.

"సర్లే అమ్మడూ! ఇప్పుడేదేం లాభం? ఇలాంటి వాటికి ఒకటే మంత్రం — ఆ కథ నే నసలు చదవనే లేదు; ఆ కథకూ నా కథకూ ఏమైనా పోలికలుంటే.... అది కేవలం యాదృచ్ఛికం మాత్రమే, ఇందుకు నేను ఎంత మాత్రం బాధ్యురాల్ని కాను.... అని రాసి పడెయ్ సరిపోతుంది" అన్నాడు కృష్ణమూర్తి.

"నువ్వేం వెటకారం చెయ్యక్కర్లేదు లేవోయ్! ఉన్న నిజం కూడా అదే."— ఆవేశంలో.... ఇంట్లో నాన్నగారున్నారన్న సంగతి కూడా మరిచిపోయి, అరిచింది శ్రీమతి.

అంతవరకూ హాల్లోంచి వాళ్ళ సంభాషణంతా ఆలకిస్తున్న రాధా కృష్ణయ్యగారు చరచరా అక్కడి కొచ్చారు. "ఇప్పటికి చేసిన వెధవ పని చాలు. ఇంకేం బుకాయింపు లొద్దు. చేసిన పొరపాటును ఒప్పుకుంటూ - నీ తప్పును ఒప్పుకుని....సంజా యిషీ రాసిచ్చేయి. ఇక నుంచి మాత్రం నువ్వు కథల జోలికి పోకు." కఠినంగా అన్నాడు.

"నాన్నా! నిజంగా...." ఏదో చెప్పబోయింది శ్రీమతి.

"షటప్!" అంటూ బిగ్గరగా అరిచి ఆమె నోటికి తాళం వేశాడు రాధాకృష్ణయ్యగారు.

నిస్సహాయురాలై నోరు మెదప లేక పోయింది శ్రీమతి. పెదాలు రెండూ నోటికి బిగించుకుని .... కన్నీరు ఏకధారగా కారుస్తూ.., శిలా విగ్రహంలా నిలుచుండిపోయింది.

చెల్లెల్ని ఆ స్థితిలో చూసి .... మరుక్షణం—కృష్ణమూర్తి మనసు కరిగిపోయింది. ఇక ఉండబట్టలేక పోయాడు. "చెల్లాయ్! ముందు నా చెంపలు రెండూ పగలగొట్టు. తర్వాత మీ అందరికీ ఓ సీక్రెట్ రిలీవ్ చేస్తాను" అంటూ చెల్లెలి ముందుకెళ్ళి చేతులు కట్టుకు నిల బడ్డాడు.

సుభాషిణి, రాధాకృష్ణయ్యగారు, అప్పుడే అక్కడి కొచ్చిన పార్వ తమ్మలతో బాటు శ్రీమతి కూడా ఆశ్చర్యంగా చూసింది కృష్ణమూర్తి కేసి.

"ఏమిట్రా అది?" సుభాషిణి రాధాకృష్ణయ్య లిద్దరూ ఒకేసారి అడిగారు. "మీ రెల్లరూ మూర్ఖులు! ఆల్ ఆఫ్ యు లుక్ ఎట్ దట్ కేలండర్" అన్నాడు కృష్ణమూర్తి.

అంతా కేలండర్ కేసి చూశారు.

రాధాకృష్ణయ్యగారికీ, సుభాషి ణికీ వెంటనే విషయం అర్థమై పోయింది. ఫక్కున నవ్వేశారు.

ఏడ్చి ఏడ్చి మతి స్థిమితం లేక పోవడంతో శ్రీమతికీ, కేలండ ర్లోని లక్ష్మీదేవినే గాని ఆ రోజు తారీఖు ఏప్రెల్ ఫస్టు అని చూడని పార్వతమ్మగారికీ విషయం ఏ మాత్రం అర్థం కాలేదు.

"ఒసే చిన్నమ్మలూ! ఇంకా ఎందుకే? తుడుచుకోవే ఆ కన్నీళ్ళు. ....ఈ రోజు ఏప్రెల్ ఫస్టు. వీడు మనల్నందర్నీ ఫూల్స్‌ని చేశా డంతే!" అంటూ చటుక్కున చెల్లెల్ని సమీపించి, పైటకొంగుతో కన్నీళ్ళు తుడిచింది సుభాషిణి.

ఆశ్చర్యానంద కోప సమ్మిళి తయై_"ఒరేయ్, ఉత్త పుణ్యానికి నన్నింతగా ఏడిపించావు కదూ....

ఉందు నిన్నేం చేస్తానో...." అంటూ చెయ్యెత్తి కృష్ణమూర్తి మీదకు దూకింది శ్రీమతి. ఆమె చేతికి అందకుండా తప్పించుకుని రెండు చేతులూ జోడించి—

"అమ్మడూ! నన్ను మన్నించు. ఈ రోజు నిన్ను ఇంతగా ఏడిపించి నందుకు—అందుకు విరుగుడుగా ఇప్పుడు నీ కొక సంతోషకర మైన వార్త చెబుతాను" అంటూ హాల్లోకి వెళ్ళి, ఆ రోజు రిలీజైన కొత్త 'విజయ' తో తిరిగొచ్చాడు కృష్ణమూర్తి. అందరూ అతడికేసి కళ్ళప్పగించి చూస్తుండగా, ఓ రెండు పేజీలు తిరగేసి బిగ్గరగా ఇలా చదివాడు-:—

"—న్యాయ నిర్ణేతల అభి ప్రాయాన్నిబట్టి ఈ సారి కుమారి శ్రీమతి రచన 'నేరం' ప్రథమ స్థానం, శ్రీమతి లావణ్య రచన 'కాదు' ద్వితీయస్థానం, ఎల్. అప్పలాజు రచన 'తమాషా' తృతీయస్థానాన్ని పొందాయి.ఆయా కథల రచయిత(త్రు)లను అభినం దిస్తున్నాం."

అది వినగానే—ఒక్కసారిగా తనను నరకంలోంచి స్వర్గంలోకి ప్రమోట్ చేసినట్లుగా అనిపించింది శ్రీమతికి. చప్పట్లు కొడుతూ— చిన్న పిల్లలా గంతులేయడం ప్రారంభించింది.

చెల్లెలితోపాటు తానూ చప్పట్లు కొడుతున్న కృష్ణమూర్తిని — "జానాగేయ్ .... ఇంతకూ నీ కా కార్డెలా గొచ్చింది?" అనడిగింది అంతా అర్థమై ఆ విషయమొక్కటీ అర్థంగాని సుభాషిణి — కుతూహ లంగా.

"అదా!" పకపకా నవ్వాడు కృష్ణమూర్తి "తన కథను ప్రచు రించే ముందు వచ్చిన కార్డది. ఇంక్ రిమూవర్‌తో ఆ మేటర్ చెరిపేసి, హేండ్ రైటింగ్ మార్చి, కొత్త మేటర్ సృష్టించానంతే! అన్నట్లు మరో విషయం .... తెలుగులో కల్పన అనే మాసపత్రిక లేనేలేదు, తెలుసా?"

"ఆఁ!?" ఆశ్చర్యంతో నోరు తెరిచింది సుభాషిణి.

"సంతోషించాం లేవోయ్, నీ తెలివితేటలకి. ఎంత సరదాకైతే మాత్రం అంతచేటా ఏడ్పించటం ...." అంటూ మొదలుపెట్టి, మెత్త మెత్తగా కృష్ణమూర్తిని చీవాట్లే శాడు రాధాకృష్ణమూర్తిగారు.

తప్పుతుందా మరి? ఉగాదినాడు ఇష్టం లేకున్నా ఉగాది పచ్చడి తిన్నట్లు ఆ చీవాట్లన్నీ తిని కడుపు నింపుకొన్నాడు కృష్ణమూర్తి. ★